సాక్షి
వనపర్తి
గురువారం । 28 । డిసెంబర్ । 2023



మిరుమిట్లు గొలిపే పాల ఉట్లు
మక్తల్ పడమటి ఆంజన్న ఉత్సవాల్లో బుధవారం పాలఉట్ల కార్యక్రమం నిర్వహించారు.
వివరాలు 10లో ▸



నిలకడగా ఉల్లి ధరలు
దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం ఉల్లి ధరలు నిలకడగా ఉన్నాయి.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.4 /13.5

వాతావరణం
ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి. రాత్రి వేళ చలి తీవ్రత పెరుగుతుంది.

మారిన రాజకీయం


కొల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తల గెలుపు సంబురాలు (ఫైల్)

కాలం గిర్రున తిరిగింది. 2023 సంవత్సరం భారత రాష్ట్ర సమితికి చేదు జ్ఞాపకాన్ని మిగల్చగా.. కాంగ్రెస్‌కు పునరుజ్జీవాన్ని ప్రసాదించింది. రాష్ట్రంతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా 'హస్త'గతం కాగా రాజకీయ ముఖచిత్రం మారింది. అంతేకాదు.. సుమారు ఏడు దశాబ్దాల తర్వాత ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించే అవకాశం పాలమూరుకు దక్కింది. అవిభాజ్య మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన బూర్గుల రామకృష్ణారావు 1952లో హైదరాబాద్ రాష్ట్రంలో సీఎంగా పనిచేసిన విషయం తెలిసిందే. తాజాగా ఇటీవల ఇదే జిల్లాలోని కొడంగల్ ఎమ్మెల్యే ఎనుముల రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో పాలమూరు కీర్తి ఎల్లలు దాటింది.

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

సున్నా నుంచి 12 స్థానాలకు..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రెండు పర్యాయాలుగా జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్‌తో సహా అన్ని ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ (అప్పటి టీఆర్‌ఎస్) సత్తా చాటింది. రాష్ట్రంతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధిక స్థానాల్లో గెలుపొంది ఎదురులేని పార్టీగా అవతరించింది. పాలమూరులో మొత్తం 14 నియోజకవర్గాలు ఉండగా.. 2018లో 13 స్థానాలు కైవసం చేసుకుంది. కొల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలుపొందిన బీరం హర్షవర్ధన్‌రెడ్డి సైతం ఆ తర్వాత పరిణామాల క్రమంలో కారెక్కగా.. బీఆర్‌ఎస్ హవా కొనసాగింది. అయితే ఈ ఏడాది నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో ఓటర్లు 'కారు'ను బోల్తా కొట్టించారు. గద్వాల, అలంపూర్ ఈ రెండు స్థానాల్లో మాత్రమే బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపొందగా.. మిగిలిన 12 స్థానాల్లో హస్తం అభ్యర్థులు విజయఢంకా మోగించారు.

'సీన్'రివర్స్..

నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడిన నాగం జనార్దన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరారు. వనపర్తిలో టీడీపీకి చెందిన రావుల చంద్రశేఖర్‌రెడ్డి, జడ్చర్లలో కాంగ్రెస్‌కు చెందిన ఎర్రశేఖర్, కొల్లాపూర్‌లో కాంగ్రెస్‌కు చెందిన అభిలాష్‌రావు కారు ఎక్కారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందనే అంచనాతో ఆ పార్టీలో చేరగా.. అంచనాలు తలకిందులయ్యాయి.

పాలమూరు 'హస్త'గతం

- అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం
- గెలుపొందిన వారిలో 9 మంది కొత్తవారే..
- పార్టీ మారి భంగపడిన నాగం, రావుల, ఎర్రశేఖర్

మంత్రులకూ తప్పని ఓటమి

మహబూబ్‌నగర్, వనపర్తి నుంచి ప్రాతినిధ్యం వహించిన మంత్రులకూ ఈ ఎన్నికల్లో భంగపాటు తప్పలేదు. మహబూబ్‌నగర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి శ్రీనివాస్‌గౌడ్‌పై కాంగ్రెస్ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి 18,738 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. వనపర్తిలో నిరంజన్‌రెడ్డిపై తూడి మేఘారెడ్డి 25,320 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు.


పాలమూరు ప్రజా ఆశీర్వాదసభలో అభివాదం చేస్తున్న కేసీఆర్ (ఫైల్)

కారు దిగి.. చేజిక్కించుకుని..

ఎన్నికల క్రమంలో అటుఇటుగా ముఖ్యనేతలు చేరికలు పెద్ద ఎత్తున చోటుచేసుకున్నాయి. బీఆర్‌ఎస్ నుంచి సస్పెన్షన్‌కు గురైన మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన పెద్ద మందడి ఎంపీపీ తూడి మేఘారెడ్డి, బీఆర్‌ఎస్‌కు చెందిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. వీరందరూ హస్తం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. అదేవిధంగా ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఆయన కుమారుడు రాజేష్ రెడ్డి హస్తం గుర్తుపై పోటీ చేసి గెలుపొందారు. సీనియర్ నాయకుడు జూపల్లికృష్ణారావు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, పురావస్తు శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

రివైండ్ 2023

పోటీకి దూరంగా హేమాహేమీలు..

ఈ ఎన్నికల్లో పలువురు హేమాహేమీ నేతలు పోటీకి దూరంగా ఉన్నారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, మాజీ మంత్రులు చిన్నారెడ్డి, నాగం జనార్దన్‌రెడ్డి పోటీ చేయలేదు. గద్వాలలో బీసీవాదం నేపథ్యంలో ఆ వర్గానికి టికెట్ కేటాయించేలా డీకే అరుణ పోటీ నుంచి తప్పుకున్నారు. వనపర్తిలో తొలుత చిన్నారెడ్డికే టికెట్ కేటాయించినా.. బీఫాం మేఘారెడ్డికి ఇచ్చారు. దీంతో చిన్నారెడ్డి పోటీకి దూరంగా ఉన్నారు. కల్వకుర్తిలో కసిరెడ్డి నారాయణరెడ్డికి వంశీచంద్‌మద్దతు ఇచ్చి.. ఆయనే స్వయంగా పోటీ నుంచి తప్పుకున్నారు.

బీజేపీకి భంగపాటు..

ఈ ఎన్నికల్లో సత్తాచాటుతామని భావించిన బీజేపీకి భంగపాటే ఎదురైంది. కల్వకుర్తి, మక్తల్ మినహా మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, నారాయణపేట, వనపర్తి, అచ్చంపేట, షాద్‌నగర్, కొడంగల్, గద్వాల, అలంపూర్, కొల్లాపూర్‌లో డిపాజిట్ దక్కలేదు. కల్వకుర్తిలో గతంలో స్వల్ప ఓట్లతో ఓటమి పాలైన ఆచారికి ఆరోసారి నిరాశే ఎదురైంది. నాగర్‌కర్నూల్‌లో జనసేన అభ్యర్థికి సైతం డిపాజిట్ రాలేదు.

పాలమూరు చుట్టే రాజకీయం..

ఎన్నికల నేపథ్యంలో 2023 సంవత్సరంలో తొలి నుంచీ అన్ని పార్టీలు పాలమూరుపైనే ఫోకస్ పెట్టాయి. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లిఖార్జున ఖర్గేతో పాటు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అగ్రనేతలు అమిత్‌షా, జేపీ నడ్డా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రచారసభల్లో హోరెత్తించారు. బీఆర్‌ఎస్ అధినేత, అప్పటి సీఎం కేసీఆర్ అన్నీ తానై ఉమ్మడి జిల్లాలోని 14 సెగ్మెంట్లలో నిర్వహించిన ప్రచారసభల్లో పాల్గొన్నారు. కేటీఆర్, హరీష్‌రావు పలు నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించారు.


పాలమూరు బహిరంగసభలో అభివాదం చేస్తున్న మోదీ (ఫైల్)

'చల్ల'గా ఖరారు.. 'విజయ'ం

ఈ ఏడాది మార్చిలో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా అలంపూర్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డి ఎన్నికయ్యారు. ఆ తర్వాత క్రమంలో అప్పటి ఎమ్మెల్యే అబ్రహంతో ఆయనకు పొసగక పోవడం.. బీఫాం లొల్లి.. పోలింగ్‌కు దగ్గరపడుతున్న సమయంలో చల్లా అనుచరుడు విజయుడికి బీఫాం దక్కడం వంటి నాటకీయ పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. దీంతో అసంతృప్తి వ్యక్తం చేస్తూ అబ్రహం, మరో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మందా జగన్నాథం కాంగ్రెస్‌లో చేరారు. ఈ నేపథ్యంలో హస్తం అభ్యర్థి సంపత్ గెలుపు ఖాయమని భావించినా.. చల్లా రాజకీయ చతురతతో విజయుడు నియోజకవర్గంలో అధిక మెజార్టీతో విజయం సాధించడం విశేషం.


తొలిసారిగా 9 మంది..

ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. తొమ్మిది స్థానాల్లో గెలుపొందిన వారు తొలిసారిగా శాసనసభలో అడుగుపెట్టారు. ఇందులో జనంపల్లి అనిరుధ్‌రెడ్డి (జడ్చర్ల), డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి (నారాయణపేట), జి.మధుసూదన్‌రెడ్డి (దేవరకద్ర), వాకిటి శ్రీహరి (మక్తల్), వీర్లపల్లి శంకర్ (షాద్‌నగర్), డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి (నాగర్‌కర్నూల్), కసిరెడ్డి నారాయణరెడ్డి (కల్వకుర్తి), మేఘారెడ్డి (వనపర్తి) కాంగ్రెస్ కాగా.. అలంపూర్ నుంచి బీఆర్‌ఎస్‌కు చెందిన విజయుడు ఉన్నారు.

ప్రజాపాలనకు శ్రీకారం

నేటి నుంచి ఆరు గ్యారంటీల అమలుకు దరఖాస్తులు

- ఉదయం 8 నుంచి సాయంత్రం 6 వరకు దరఖాస్తుల స్వీకరణ
- జనవరి 6 వరకు కొనసాగనున్న కార్యక్రమం
- గ్రామపంచాయతీలు, మున్సిపల్ వార్డుల వారీగా ఏర్పాట్లు
- రేషన్‌కార్డులు, రెవెన్యూ సమస్యలకు ప్రత్యేక కౌంటర్లు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/సాక్షి, నాగర్‌కర్నూల్: కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల అమలులో భాగంగా 'ప్రజాపాలన' కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గురువారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుండగా జనవరి 6 వరకు కొనసాగనుంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మొత్తం 1,693 గ్రామపంచాయతీలతో పాటు 19 మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 388 వార్డుల్లో 'ప్రజాపాలన' కార్యక్రమం కింద ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని జిల్లా కలెక్టర్లతో హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించగా, బుధవారం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన ఉమ్మడి జిల్లాలోని అధికార యంత్రాంగంతో సన్నాహక సమావేశం నిర్వహించారు. బుధవారం నుంచి జనవరి 6వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 6 గంటల వరకు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించనుండగా ఇందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు.

గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల హామీ కోసం అర్హులైన వారి నుంచి ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించనుంది. ఇందుకోసం ప్రజాపాలన కార్యక్రమం దరఖాస్తు ఫారాన్ని అందుబాటులోకి తెచ్చింది. కాంగ్రెస్ గ్యారంటీల్లో భాగమైన మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ.2,500, గ్యాస్ సిలిండర్ రూ.500, గృహజ్యోతి పథకం కింద కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ.15 వేలు, కౌలు రైతులకు ఏటా రూ.12 వేల పెట్టుబడి సాయం, ఇందిరమ్మ ఇళ్ల కింద పేదల ఇండ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం, అమరవీరులు, ఉద్యమకారులకు 250 చ.గజాల ఇంటి స్థలం కేటాయింపు, చేయూత పథకం కింద నెలకు రూ.4 వేల పెన్షన్, దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్ అందించేందుకు ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తోంది. అయితే యువ వికాసం కింద పేర్కొన్న నిరుద్యోగ భృతి కోసం ఈ దరఖాస్తు ఫారంలో ఆప్షన్‌ను పొందుపర్చలేదు. ఈ పథకాల అమలుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్, రేషన్ కార్డులను సమర్పించాల్సి ఉంటుంది. రేషన్‌కార్డు అందుబాటులో లేకున్నా అధికారులు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తుకు సంబంధిత అధికారి నుంచి రసీదు ఇవ్వనున్నారు.

ప్రతి దరఖాస్తుకు రసీదు

గ్రామపంచాయతీలు, వార్డుల వారీగా ఏర్పాట్లు..

ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలు, పట్టణాల్లోని వార్డుల వారీగా ప్రజాపాలన కార్యక్రమం కింద దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇందులో భాగంగా మండలానికి ఒకరు చొప్పున స్పెషల్ అధికారిని నియమించింది. గ్రామాలు, వార్డుల వారీగా షెడ్యూల్‌ను ఖరారు చేసి ఆయా తేదీలు, గ్యారంటీ పథకాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. జనాభా ఎక్కువగా ఉండే పెద్ద గ్రామపంచాయతీల్లో రెండు రోజులు దరఖాస్తులకు ప్రత్యేక సమయం కేటాయించడంతో పాటు ఒకే రోజున రెండు చొప్పున చిన్న గ్రామపంచాయతీల్లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఇందుకోసం అధికార బృందాలను ఇప్పటికే కేటాయించారు. ఒక్కో గ్రామం, మున్సిపల్ వార్డుల్లో రెండు షిఫ్టుల్లో పది చొప్పున కౌంటర్లను ఏర్పాటు చేయనున్నారు. దరఖాస్తుల స్వీకరణ సమయంలో గ్రామాలు, వార్డుల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నీడ కోసం టెంట్లు, కుర్చీలు, తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటుచేయనున్నారు. నిరక్షరాస్యులు దరఖాస్తు ఫారాన్ని నింపేందుకు వీలుగా అంగన్‌వాడీ టీచర్ల సహాయం అందించనున్నారు. దరఖాస్తుల కోసం భారీ క్యూలైన్లు, రద్దీ నియంత్రణకు పోలీసులు, మహిళా సిబ్బంది బందోబస్తు చేపట్టనున్నారు.

రెవెన్యూ, రేషన్‌కార్డులకు ప్రత్యేక కౌంటర్..

కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టనుండగా, వీటితో పాటు కొత్త రేషన్‌కార్డులు, రెవెన్యూ, భూ సమస్యలపై ప్రభుత్వానికి పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చే అవకాశం ఉండటంతో ఇందుకు సైతం ఏర్పాట్లు చేశారు. అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులు, రెవెన్యూ సమస్యలు, ఇతర విన్నతుల దరఖాస్తులకు ప్రత్యేకంగా కౌంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. అర్హులైన వారిలో ఎవరైనా జనవరి 6 తేదీలోగా దరఖాస్తు ఫారాలను ఇవ్వలేకపోతే సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయం, మండల కార్యాలయంలో ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కార్యక్రమం అమలు తీరుపై మండల స్థాయిలో స్పెషల్ ఆఫీసర్లు, జిల్లా కలెక్టర్లు, ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి టీకే శ్రీదేవి, ఇన్‌చార్జి మంత్రులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు.

ఉమ్మడి జిల్లాలోని గ్రామాలు, మున్సిపల్ వార్డులు	జిల్లా	మహబూబ్‌నగర్	నాగర్‌కర్నూల్	వనపర్తి	నారాయణపేట	జో.గద్వాల
	గ్రామ పంచాయతీలు	442	461	255	280	255
	మున్సిపల్ వార్డులు	86	86	83	56	77


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, చిత్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ రాములు, ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, పర్ణికారెడ్డి, వంశీకృష్ణ, అనిరుధ్‌రెడ్డి, ఆయా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు

విజన్‌తో ముందుకెళ్తే అద్భుతాలు

- ప్రజాపాలనతో తొలి అడుగు
- చిత్తశుద్ధితో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తాం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- పాలమూరులో ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల సన్నాహక సమావేశం


సమావేశానికి హాజరైన ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు

- వివరాలు 8లో..

'ప్రజాపాలన'కు నోడల్ ఆఫీసర్‌గా టీకే శ్రీదేవి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు 'ప్రజాపాలన' నోడల్ ఆఫీసర్‌గా టీకే శ్రీదేవి నియమితులయ్యారు. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబ్‌నగర్‌తో పాటు నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, నారాయణపేట, వనపర్తి జిల్లాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని శ్రీదేవి పర్యవేక్షించనున్నారు.

3న అంబేడ్కర్ నాటక ప్రదర్శన

వనపర్తి టౌన్: కలెక్టర్ తేజస్ పవార్ సూచన మేరకు జనవరి 3వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు డా. బీఆర్ అంబేడ్కర్‌పై 'సంగం శరణం గచ్ఛామి' అనే నాటక ప్రదర్శన నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎ.నుశిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని సురవరం సాహితీ కళాభవన్‌లో ఎం/ఎస్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ, హైదరాబాద్ కళాబృందం ప్రదర్శన చేపడుతుందని పేర్కొన్నారు.

కో-ఆప్షన్ సభ్యుడి రాజీనామా

అమరచింత: స్థానిక పుర కో-ఆప్షన్ సభ్యుడు అడ్వొకేట్ ఏపీ రాజేందర్ బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని పుర కమిషనర్ మహ్మద్ ఖాజా, చైర్‌పర్సన్ మంగమ్మకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా పదవిలో కొనసాగుతున్నా పట్టణాభివృద్ధికి తాను చేసిన సూచనలను ఏనాడు పాలక వర్గం, అధికారులు పట్టించుకోలేదని వివరించారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో తన పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నానని వెల్లడించారు.

కాంట్రాక్టర్ నిర్వాకం!

కార్మికుల కష్టార్జితం రూ.22,58,480 స్వాహా

- జిల్లా ఆస్పత్రిలో ఒక్కొక్కరి వేతనం నుంచి ప్రతి నెల రూ.1.090 కోత
- 148 మంది కార్మికులు.. 14 నెలలుగా...
- 72 గంటల్లో వివరణ ఇవ్వాలని నోటీసు జారీ చేసిన అధికారులు

వనపర్తిటౌన్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, ఎంసీహెచ్‌లో పారిశుద్ధ్యం, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వర్తిస్తున్న కార్మికుల కష్టార్జితాన్ని కాంట్రాక్టర్ యథేచ్ఛగా స్వాహా చేస్తున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో పారిశుద్ధ్యం, ఆస్పత్రి నిర్వహణకు 148 మంది కార్మికులను కాంట్రాక్ట్ పద్ధతిన నియమించుకునేందుకు కాంట్రాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఒకటి, రెండు నెలలు కాదు.. ఏకంగా 14 నెలలుగా కార్మికులను మభ్యపెడుతూ వారి వేతనం నుంచి రూ.22,58,480 కాజేసినట్లు అధికార యంత్రాంగం ప్రాథమికంగా ఓ నిర్ధారణకు వచ్చింది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక్కో కార్మికుడికి రూ.15,600 వేతనం ఉండగా.. పీఎఫ్, ఈఎస్‌ఐ తీసుకొని మిగిలిన రూ.12,093 బ్యాంకు ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. కానీ కాంట్రాక్టర్ కార్మికులకు ప్రభుత్వం నిర్దేశించిన వేతనం రూ.12,093 అని నమ్మబలికి అందులో నుంచి ఈఎస్‌ఐ, పీఎఫ్ కట్ చేసి వారి ఖాతాలో కేవలం రూ.11 వేలు మాత్రమే జమ చేస్తున్నట్లు సూపరింటెండెంట్ అధికారికంగా ధ్రువీకరించారు. అంటే ఒక్కో కార్మికుడి నుంచి రూ.1,090 చొప్పున 148 మంది వద్ద నుంచి ప్రతి నెల రూ.1,61,320.. 14 నెలలకు రూ.22,58,480 కాజేసినట్లు స్పష్టమవుతుంది. అధికారుల పర్యవేక్షణ కొరవడటం, ప్రభుత్వ మార్గదర్శకాలను పరిశీలించకుండా మిన్నకుండటంతో ఈ పరిస్థితి నెలకొందని కార్మికులు వాపోతున్నారు. కార్మికులకు వేతనాలు సక్రమంగా అందేలా చూడాలని 20 రోజుల క్రితం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినా అదికూడా చూడలేని స్థితిలో అధికార యంత్రాంగం ఉండటం గమనార్హం.



ఆలస్యంగా రంగంలోకి..

కాంట్రాక్టర్ ప్రతి నెల ఒక్కో కార్మికుడి వేతనం నుంచి రూ.1,090 కోత విధించినట్లు ఆలస్యంగా గుర్తించిన అధికారులు 72 గంటల్లో వివరణ ఇవ్వాలంటూ కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశారు. ఒక్కో కార్మికుడి ఖాతాలో ఎంత నగదు జమ చేయాలి.. ఎంత పీఎఫ్ జమ చేయాలనే లెక్కలు తీస్తున్నట్లు అధికార యంత్రాంగం చెప్పడం విడ్డూరంగా ఉంది. అలాగే కార్మికుల పీఎఫ్‌పై స్పష్టత లేదని.. కొందరి పీఎఫ్ ఖాతాలు ఇవ్వలేదని, మరికొందరి ఖాతాలో ఒకటి, రెండు, ఐదు, పది నెలలు మినహా పెద్దగా నగదు జమ కాలేదని తెలుస్తోంది.

రూ.11 వేలు ఇస్తున్నారు..



నేను జిల్లా ఆస్పత్రిలో సెక్యూరిటీగా విధులు నిర్వర్తిస్తున్నా. నాకు ప్రతి నెల రూ.11 వేల వేతనం వస్తుంది. మహిళలకు నిబంధనల ప్రకారం కాకుండా ఇష్టారీతిన విధులు కేటాయిస్తున్నారు. మూడు షిఫ్టులైనా చేస్తాం.. అందరికీ ఒకే తరహాలో వేతనం ఇవ్వాలి.
– శాంతమ్మ, సెక్యూరిటీ సిబ్బంది

ఏడేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నా..



నేను ఏడేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నా. నెలలో నాలుగు వీక్లీఆఫ్‌లు పోను రూ.11 వేల వేతనం వస్తుంది. అంతకుమించి ఒక్క రూపాయి ఎక్కువ రావడం లేదు.
– సంతోషి, సెక్యూరిటీ సిబ్బంది

రూ.1,090 కోత వాస్తవం..



ఆస్పత్రిలో పనిచేసే ప్రతి కార్మికుడి వేతనం నుంచి కాంట్రాక్టర్ ప్రతి నెల రూ.1,090 కోత విధించిన మాట వాస్తవామే. ఈ విషయం మీడియా, ఉన్నతాధికారులు రాసిన లేఖ ద్వారా ఇటీవలే తెలిసింది. ఆస్పత్రిలో వైద్యసేవలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించడంతో కార్మికుల సంక్షేమం విస్మరించడం మా వైఫల్యమే. ఇప్పటి వరకు ఏ కార్మికుడు కూడా రాతపూర్వకంగా ఫిర్యాదు ఇవ్వలేదు.. ఇచ్చి ఉంటే పరిష్కరించే వాళ్లం. 72 గంటల్లో వివరణ ఇవ్వాలని కాంట్రాక్టర్ శ్రీకాంత్‌రెడ్డికి నోటీసులు జారీ చేశాం.
– నరేందర్‌కుమార్, మెడికల్ సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి, వనపర్తి

క్లుప్తంగా

యువకుడు బలవన్మరణం

ధన్వాడ: మండల కేంద్రంలో ఓ యువకుడు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. భూత్పూర్ మండలం పాతమొల్గరకు చెందిన ప్రవీణ్(25) మండల కేంద్రంలోని వైన్స్‌లో పనిచేస్తున్నాడు. వైన్స్‌కి దగ్గర్లనే ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. బుధవారం ఉదయం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఆర్థికపరిస్థితి సరిగా లేనందున ఆత్మహత్యకు పాల్పడిఉంటాడని ప్రవీణ్ తమ్ముడు నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హన్వాడలో మరొకరు..

హన్వాడ: మానసిక స్థితి బాగోలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి, చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కొనగట్టుపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గడ్డం సత్తయ్య(38) మానసిక స్థితి సరిగా లేని కారణంగా పిచ్చిగా వ్యవహరించేవాడు. ఈ నెల 21న తాను ఆత్మహత్యకు పాల్పడతానని ఇంట్లో చెప్పి భార్య చీరతో గ్రామ శివారులోని శ్మశానవాటికకు వెళ్లాడు. అక్కడే ఉన్న ఓ చెట్టుకు ఉరి వేసుకున్నాడు. అప్పటికే అతడిని వెంబడించిన కుటుంబ సభ్యులు.. అతడిని చెట్టు నుంచి కిందకు దించి చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. అతడికి ఇద్దరు భార్యలు.(మొదటి భార్య అక్కరమ్మకు సంతానం కలుగకపోవడంతో చెన్నమ్మను చేసుకున్నాడు) రెండో భార్యకు ఓ బాబు, ఓ పాప ఉన్నారు. మొదటి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రవినాయక్ తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళ మృతి

ఉర్కొండ: మతిస్థిమితం కోల్పోయిన ఓ మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయి మృతిచెందిన ఘటన మండలంలోని జకినాలపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ లెనిన్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన పోలె లక్ష్మమ్మ (54) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మతిస్థిమితం కోల్పోయింది. అప్పుడప్పుడు ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి వచ్చేది. ఈ క్రమంలో ఈ నెల 23న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెదికినా ఆచూకీ లభించలేదు. బుధవారం గ్రామశివారులో మృతదేహం కనిపించడంతో గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. లక్ష్మమ్మ కుమార్తె రోజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

పెబ్బేరు రూరల్: పెబ్బేరు సమీపంలోని జయదుర్గా దాబా దగ్గర బుధవారం తెల్లవారుజామున కర్నూలు వైపు రహదారిపై వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపారు. వయసు 45 ఏళ్లు ఉండవచ్చని.. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని వనపర్తి ఆస్పత్రికి తరలించామన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి..

నర్వ: లారీ ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్‌ఐ కురుమయ్య తెలిపారు. ఆయన కథనం మేరకు.. మహబూబ్‌నగర్‌లోని క్రిస్టియన్‌పల్లికి చెందిన ఎర్రిస్వామి (30) భార్య, కుమారుడితో కలిసి మంగళవారం బైక్‌పై మక్తల్‌లోని పడమటి ఆంజనేయస్వామి ఉత్సవాలకు వెళ్లారు. జాతర ముగించుకొని అదేరోజు రాత్రి 10 గంటల సమయంలో జూరాలకు వెళ్తుండగా పెద్దకడ్మూర్ వద్ద ఎదురుగా వచ్చిన చెరకు లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎర్రిస్వామి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందగా.. భార్యా పిల్లలకు ఎలాంటి గాయాలు కాలేదు. భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఆటో బోల్తాపడి మరొకరు..



దేవరకద్ర రూరల్: ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటగిరి గ్రామానికి చెందిన నవీన్‌రెడ్డి దేవరకద్ర నుంచి ప్రయాణికులను ఎక్కించుకొని కౌకుంట్ల వైపు వేగంగా వెళ్తున్నాడు. డోకూర్ గ్రామ సమీపంలోకి రాగానే కస్తూర్బా పాఠశాల మలుపులో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో కౌకుంట్లలో ఓ శుభకార్యంలో పాల్గొనేందుకు ఆటోలో వెళ్తున్న భూత్పూర్ మండలం ఎల్కిచర్లకి చెందిన పుట్ట చెన్నయ్య(66) సంఘటన స్థలంలోనే మృతిచెందగా.. మృతుడి భార్య చెన్నమ్మకు, సంజీవ్ తీవ్ర గాయాలపాలయ్యారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

విజన్‌తో ముందుకెళ్తే అద్భుతాలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్:

ప్రజలు కోరుకున్న స్వేచ్ఛలో భాగంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనతో తొలి అడుగు వేస్తోందని, విజన్‌తో సంక్షేమ ఫలాలు అందిస్తే అద్భుతాలు సృష్టించవచ్చని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉమ్మడి పాలమూరు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రజా పాలన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టాలని సూచించారు. సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని, ఆ ఆలోచనతోనే ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అధికార యంత్రాంగం ప్రజల ముందుకు వెళ్లి ఆరు గ్యారంటీలను ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజు అధికారులు గ్రామాలకు వెళ్లి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని, ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు ఏదో ఓ రోజు గ్రామంలో దరఖాస్తులను స్వీకరించిన అనంతరం సైతం ఇద్దరు అధికారులు అందుబాటులో ఉండి షెడ్యూల్ చివరి రోజు వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని ఇచ్చిన వాగ్దానాలు అన్నింటిని నెరవేరుస్తామని, ప్రజాపాలన కార్యక్రమం అమలుకు మరిన్ని సూచనలు, సలహాలు ఇస్తే పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు.

ప్రజాపాలనతో తొలి అడుగు

- చిత్తశుద్ధితో హామీలను అన్నింటిని నెరవేరుస్తాం
- దరఖాస్తుల స్వీకరణకు వీలైనన్ని కౌంటర్లు ఏర్పాటు చేయాలి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



సమావేశ మందిరానికి మంత్రులు దామోదర రాజనరసింహ, జూపల్లితో కలిసి వస్తున్న కలెక్టర్లు

విజయవంతం చేసే బాధ్యత వారిదే: మంత్రి జూపల్లి



రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఎన్నో త్యాగాల ఫలితంగా ప్రత్యేక తెలంగాణ వచ్చిందని, ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీల అమలుకు ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టామని, అధికార యంత్రాంగమే ప్రజల వద్దకు వెళ్లి దరఖాస్తులు తీసుకుంటుందని అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం చేయాలని, ఎవరికి ఇబ్బంది కలగకుండా దరఖాస్తులను స్వీకరించాలని, వీలైనన్నీ కౌంటర్లు ఏర్పాటు చేయాలని, కలెక్టర్లు, జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసే బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందని ఆయన అన్నారు.



❐ మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యులు మన్నె శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలకు కావాల్సిన కార్యక్రమాలు ఎప్పటినుండి అమలు చేస్తారో, ఎప్పటి నుండి అందుబాటులోకి వస్తాయో తెలపాలని కోరారు.



❐ వనపర్తి కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, లబ్ధిదారులకు ముందుగానే రూపొందించిన దరఖాస్తు ఫారాన్ని అందించి వారు దానిని నింపి ఇచ్చే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. దరఖాస్తు స్వీకరించిన అనంతరం వారికి రశీదు ఇవ్వడం జరుగుతుందని, గ్రామాల షెడ్యూల్ అందరికీ తెలియజేసే విధంగా విస్తత ప్రచారం నిర్వహిస్తామని, దీనికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని అన్నారు.



❐ నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఇందుకుగాను ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారి ఉంటారని, ఆరు గ్యారంటీలకు దరఖాస్తుల స్వీకరణతో పాటు, ఇతర సమస్యల పరిష్కారానికి కూడా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు.



❐ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు రాములు మాట్లాడుతూ.. కొందరు ఇదివరకే ఆసరా పెన్షన్లు పొందుతున్నందున మహాలక్ష్మి పథకం, అలాగే రైతు భరోసాను ఎప్పటినుండి అమలు చేస్తారో తెలియజేయాలని అన్నారు. అలాగే, ధాన్యం బోనస్‌కు ఒక తేదీని తెలపాలని కోరారు.



❐ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సకాలంలో దరఖాస్తులు ఇవ్వని వారికి తర్వాత దరఖాస్తులు ఇచ్చేందుకు ఉన్న అవకాశాన్ని తెలియజేయాలని కోరారు. వలస కార్మికుల పరిస్థితిని సైతం పరిగణలోకి తీసుకుంటే బాగుంటుందన్నారు.

❐ వనపర్తి జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ రైతు రుణమాఫీ, హామీల అమలు ఎప్పటి నుంచి ప్రారంభిస్తుందో తెలియజేయాలని కోరారు.



❐ దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ షెడ్యూల్ తర్వాత పంచాయతీలో దరఖాస్తులు తీసుకోవాలని కోరారు.



❐ అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు కాకుండా ఇతర అంశాలపై వచ్చిన దరఖాస్తులు కూడా స్వీకరిస్తే బాగుంటుందని సూచించారు.



❐ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రజాపాలన లో భాగంగా అర్హత ఉన్న లబ్ధిదారులు తప్పిపోకుండా అందరు కవర్ అయ్యేలా చూడాలని కోరారు.



సమావేశానికి హాజరైన ఉమ్మడి జిల్లా అధికారులు



❐ గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం కింద సంవత్సరానికి ఎన్ని గ్యాస్ సిలిండర్లు ఇస్తారో ప్రకటించాలని, ఇదివరకే పెన్షన్ వస్తున్న వారి నుంచి దరఖాస్తులు తీసుకుంటారా లేదా అనేది తెలియజేయాలని కోరారు.



❐ నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడుతూ కొత్త రేషన్‌కార్డులకు సంబంధించి సూచనలతో పాటు, కొత్త గ్యాస్ కనెక్షన్లపై పూర్తి వివరాలు ప్రజలకు వివరించాలని అనివార్య కారణాలతో దరఖాస్తులు ఇవ్వలేకపోయిన వారి నుండి దరఖాస్తులు స్వీకరించాలని కోరారు.



❐ మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రతి సంక్షేమ పథకం లబ్ధిదారు వరకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు.

❐ గద్వాల జెడ్పీచైర్‌పర్సన్ సరిత మాట్లాడుతూ అన్ని పథకాల సమాచారాన్ని స్పష్టంగా ఇవ్వాలని, లబ్ధిదారులు ఎలాంటి అయోమయానికి గురికాకుండా దరఖాస్తులు తీసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, నారాయణపేట జెడ్పీచైర్‌పర్సన్ వనజ, గద్వాల అదనపు కలెక్టర్ చౌహాన్, మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, నాగర్‌కర్నూల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్, వనపర్తి జిల్లా ఎస్పీ రక్షిత తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగలో.. తిక్క ఆకు మచ్చ తెగులు



వేరుశనగ పంట

అలంపూర్: జిల్లాలో నీటి వనరులు, బోరు బావులు, కాల్వల కింద వేరుశనగ పంటలను సాగు చేశారు. జిల్లాలో ఈ సారి అత్యధికంగా వేరుశనగ పంటను రైతులు సాగు చేశారు. పంట ప్రస్తుతం పూత దశ నుంచి పిందె దశకు చేరుకుంటుంది. వేసిన వేరుశనగ పంటలకు అక్కడక్కడ తిక్క ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. తిక్క ఆకుమచ్చ తెగులుకు సకాలంలో నివారణ చర్యలు తీసుకోవాలని ఏడీఏ సక్రియనాయక్ సూచిస్తున్నారు. ఈ ఆకు పంటకు రెండు దశలో ఆశిస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. పంట వేసిన నెల రోజుల్లో ఆశించే ఆకు మచ్చను లేత తిక్క తెగులు, పూత లేదా తర్వాత దశలో ఆశించే తెగులును ముదురు ఆకు మచ్చ తెగులుగా పేర్కొంటున్నారు. పూత దశలో ఆకు మచ్చ తెగులు ఆశిస్తే దిగుబడులు బాగా తగ్గే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. తెగులు లక్షణాలు, నివారణ గురించి రైతులకు ఈ విధంగా వివరిస్తున్నారు.



తిక్క ఆకు మచ్చ తెగులు సోకిన వేరుశనగ పంట

లక్షణాలు

లేత ఆకుమచ్చ తెగులు పంట వేసిన 30 రోజుల నుంచి కనిపిస్తుంది. ఈ మచ్చలు కొంచెం గుండ్రంగా ఉండి ఆకుల పైభాగాన ముదురు గోధుమ రంగు కలిగి ఉంటాయి. ముదురు ఆకు మచ్చ తెగులు అలస్యంగా పంట మీద కనిపించి మచ్చలు చిన్నవిగా గుండ్రంగా ఉండి ఆకు అడుగు భాగాన నల్లని రంగు కలిగి ఉంటాయి. మచ్చ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటే ఆకులు పసుపు రంగుకు మారి నిర్జీవమైపోతాయి. మచ్చలు ఒకదానితో ఒకటి కలిసిపోతాయి. తర్వాత ఆకులు మొక్కలు పక్కానికి రాకముందే ఎండిపోయి రాలిపోతాయి. మచ్చ తెగులు ఆకు మీద కాకుండా కాండం మీద, ఆకు కాడలు, ఊడల మీద కూడా ఈ మచ్చలు ఏర్పడతాయి.

నివారణ

తెగులు కనిపించిన వెంటనే మాంకోజెబ్ 400 గ్రాములు లేదా కార్బండిజమ్ 200 గ్రాములు లేదా క్లోరోథలోనిల్ 400 గ్రాములు లేదా హెక్సా కొనజోల్ 400 మి.లీ.ను 200 లీటర్ల నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

అనుమానాస్పదంగా మృతి

చిన్నచింతకుంట: అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని కురుమూర్తిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బత్తుల భరత్‌కుమార్ (35) అనారోగ్యంతో బాధపడుతుండగా భార్య స్వాతిక మంగళవారం సాయంత్రం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లింది. ఆస్పత్రికి చేరుకోగానే భరత్‌కుమార్ మృతి చెందాడు. బుధవారం ఉదయం మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చారు. మృతుని తల్లి వెంకటమ్మ తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

గద్వాలలో యువతి..

గద్వాల క్రైం: అనుమానాస్పదంగా యువతి మృతి చెందిన సంఘటన బుధవారం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు, బంధువుల కథనం మేరకు.. గద్వాల పట్టణంలోని వెంకటరమణకాలనీకి చెందిన రేణుక (20) డిగ్రీ చదువుతుంది. ఈ క్రమంలో ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. ఇదే విషయం ఇంట్లో పెద్దలు తెలిసింది. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు యువతిని మానసికంగా వేధింపులకు గురి చేయడంతో మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో స్పృహ లేకుండా పడిపోయింది. కుటుంబసభ్యులు వచ్చి చూసి ఆమెను కాపాడే ప్రయత్నం చేశారు. ఎలాంటి చలనం లేకపోవడంతో చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఘటనపై పట్టణ ఎస్‌ఐ శ్రీకాంత్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదన్నారు.

చీటింగ్ కేసు నమోదు

కొత్తకోట రూరల్: మండలంలోని మిరాసిపల్లి శివారులో ఉన్న ఇషాన ట్రేడర్స్ రైస్‌మిల్లు యజమాని మధుకుమార్‌రెడ్డిపై బుధవారం చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. 13న మిల్లులో తనిఖీలు చేపట్టా, సీఎంఆర్ వరి ధాన్యం 26వేల సంచులు లేకపోవడంతో రైస్ మిల్లు యజమానిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

- పోలీస్‌స్టేషన్ ఎదుట బంధువుల ఆందోళన
- భర్త, కుటుంబ సభ్యులపై కేసు నమోదు



పోలీస్‌స్టేషన్ ఎదుట జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

జడ్చర్ల: మండలంలోని చిన్న ఆదిరాల గ్రామపంచాయతీ తుపుడగడ్డతండాకు చెందిన మంజుల (26) అనుమానాస్పద స్థితిలో మృతిచెందగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు. బాధితుల కథనం మేరకు.. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం నల్లరాళ్లతండాకు చెందిన మంజుల, తుపుడగడ్డతండాకు చెందిన రమేశ్‌నాయక్ ఆరేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. భర్త, కుటుంబ సభ్యులు వరకట్నం తీసుకురావాలంటూ పలుమార్లు ఒత్తిడి చేయడంతో పాటు మానసిక, శారీరక వేధింపులకు గురి చేశారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. భర్త రమేశ్, మరిది, అత్తామామలు తీవ్రంగా కొట్టడంతోనే అపస్మారక స్థితిలోకి వెళ్లిందని.. నోట్లో పురుగుమందు పోసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని మంజుల కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకొని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మాట్లాడలేక మూగ సైగలతో వివరించిందన్నారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ బుధవారం పోలీస్‌స్టేషన్ ఎదుట మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. సీఐ రమేశ్‌బాబు పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బాధితుల ఫిర్యాదు మేరకు భర్త రమేశ్‌నాయక్, మరిది శ్రీకాంత్, అత్త దేవి, మామ లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గాయపడిన జింక అప్పగింత

కొత్తకోట రూరల్: మండలంలోని అప్పరాల సమీపంలో గల రామన్‌పాడు ఎడమ కాల్వలో ఓ జింక గాయాలతో స్థానిక రైతులకు కనిపించింది. జింకను రైతులు గ్రామ సర్పంచ్ హిమబిందు, గ్రామ పెద్దలకు అప్పగించారు. వారు మండల పశువైద్యాధికారి విజయ్‌కుమార్‌కు సమాచారం అందించడంతో అప్పరాలకు చేరుకుని జింకకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం జిల్లా ఫారెస్ట్ అధికారులను పిలిపించి వారికి జింకను అప్పగించారు.



జింకను ఫారెస్ట్ అధికారులకు అప్పగిస్తున్న రైతులు

బైక్‌ను ఢీకొట్టిన రైలు

- నిమిషంలో తప్పిన పెను ప్రమాదం
- ప్రాణాలతో బయటపడిన దంపతులు

దేవరకద్ర రూరల్: రైలు పట్టాల పైనుంచి ద్విచక్ర వాహనం దాటిస్తుండగా.. అకస్మాతుగా రైలు రావడంతో బైక్ పూర్తిగా ధ్వంసమై దంపతులు ప్రాణాలతో బయటపడిన సంఘటన బుధవారం డోకూర్ గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పేరూర్‌కి చెందిన అశోక్ తన భార్యకు వైద్యం నిమిత్తం డోకూర్‌కు వచ్చాడు. గ్రామంలో ఉన్న రైల్వే గేట్ వద్ద వారం రోజుల కిందట రైల్వే అధికారులు అండర్‌పాస్ నిర్మాణం చేపట్టి ప్రయాణికుల రాకపోకలకు ప్రత్యామ్నాయ దారిని ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలియకపోవడంతో గతంలో ఉన్న మార్గంలో వచ్చిన అశోక్ తన ద్విచక్రవాహనాన్ని (అండర్‌పాస్ నిర్మాణం పక్క నుంచి) పట్టాల పైనుంచి దాటిస్తున్న క్రమంలో అకస్మాతుగా రైలు వచ్చింది. దీంతో పట్టాలపై బైక్‌ను వదిలేసి పక్కకు తప్పుకొన్నాడు. ఈ సంఘటనలో బైక్ పూర్తిగా ధ్వంసం కాగా.. దంపతులు ఇద్దరూ ప్రాణాలతో బయటపడ్డారు. బైక్ రైలు ముందు భాగంలో చిక్కుకపోవడంతో లోకోపైలెట్ రైలును నిలిపివేశాడు. స్థానిక సిబ్బంది సాయంతో రైలు కింద చిక్కుకున్న బైక్‌ను తొలగించిన అనంతరం రైలు ముందుకు కదిలింది. ఈ సంఘటనతో రైలు దాదాపు 15 నిమిషాల పాటు నిలిచిపోయింది.



రైలు కింద పడిన బైక్‌ను తొలగిస్తున్న సిబ్బంది

పెద్దపులి దాడిలో ఆవు..



అమ్రాబాద్: పెద్దపులి దాడిలో ఆవుపెయ్య మృతిచెందిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. మండలంలోని కుమ్మరోనిపల్లికి చెందిన మడ్డి సాయిబాబు ఇటీవల తన పాడజాతి ఆవుపెయ్యను తమ బంధువుల మందలో పదర మండలం మద్దిమడుగు అటవి ప్రాంతంలో ఉంచాడు. ఆవుపెయ్య ఐదు రోజుల కిందట తప్పిపోవడంతో వారు వెతకసాగారు. మద్దిమడుగు అటవీ ప్రాంతంలోని చెరువు వద్ద పెద్దపులి దాడిలో మృతిచెంది ఉండటాన్ని వారు గుర్తించారు. ఈ విషయమై అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. బాధిత రైతు, అటవీశాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించినట్లు బీట్ అధికారి జితేందర్ తెలియజేశారు. పాడజాతి ఆవుపెయ్య విలువ రూ.60 వేలు ఉంటుందని, తమకు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని రైతు కోరారు.

వలంటీర్ల ఆగ్రహజ్వాలల్లో
పచ్చపత్రికల దహనం

- ఈనాడు, ఆంధ్రజ్యోతి తప్పుడు కథనాలు రాస్తున్నాయి
- ఎల్లోమీడియాకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్ల నిరసనలు


నాగలదిన్నెలో ఈనాడు, ఆంధ్రజ్యోతి పేపర్లను దహనం చేస్తున్న వలంటీర్లు

నందవరం/హుకుంపేట/పెదకూరపాడు/కోళ్లపాలెం/కపిలేశ్వరపురం: ఏపీలో ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా సేవాభావంతో నిరంతరం పనిచేస్తున్న వలంటీర్లు.. తమపై వస్తున్న తప్పుడు కథనాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము సమ్మె చేస్తామన్నామని, ఆడుదాం ఆంధ్రాలో పాల్గొనడంలేదని ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. తప్పుడు వార్తలు రాస్తున్న ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల ప్రతుల్ని పలుచోట్ల దహనం చేశారు. పలు ప్రాంతాల్లో వివిధ పద్ధతుల్లో నిరసన తెలిపారు. ఈనాడు రామోజీ, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఏబీఎన్, ఈటీవీ, టీవీ 5 చానళ్లు అసత్య ప్రసారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. తమకు సమ్మె, నిరసనలు చేసే ఆలోచనలే లేవని ముక్తకంఠంతో నినదించారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ఇంటింటికి చేరవేస్తున్న తమపై ఈనాడు, ఆంధ్రజ్యోతి తప్పుడు ప్రచారం చేస్తున్నాయంటూ వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి మంచిపేరు వస్తుండటంతో ఈ విధమైన అక్కసు వెళ్లగక్కుతున్నాయని చెప్పారు. తమకు ఎలాంటి సమ్మె, నిరసనలు చేసే ఉద్దేశం లేదని, అసత్యవార్తలతో వలంటీర్ల ఐక్యతను దెబ్బతీయలేరని స్పష్టం చేశారు.

..ఏఐటీయూసీ జయభేరి

మొదటి పేజీ తరువాయి

ప్రాతినిధ్యం నిలుపుకోగలిగింది. 2012, 2017లోసత్తా చాటిన బీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ ఈఎన్నికల్లో ఖాతా తెరవలేదు.

పోలింగ్ సరళి ఇలా...!: గురువారం ఉదయం నుంచే కార్మికులు బారులుదీరారు. అన్ని ఏరియాల్లో కలిపి ఉదయం 8గంటల వరకు 14.62 శాతం పోలింగ్ నమోదుకాగా, 9గంటలకు 27.05 శాతం, 10గంటలకు 38.67శాతం, 11గంటలకు 49.89శాతం, 12గంటలకు 59.33శాతం, మధ్యాహ్నం 1గంటకు 67.67శాతం 2గంటలకు 75.41శాతం, 3గంటల వరకు 85.92 శాతం, 4గంటలకు 93.09 శాతం , పోలింగ్ ముగిసే సాయంత్రం 5గంటల వరకు మొత్తంగా 94.15 శాతంగా నమోదైంది.

ఎవరు 'ప్రాతినిధ్యం'... ఎవరు గుర్తింపు సంఘం

సింగరేణివ్యాప్తంగా ఉన్న 11ఏరియాలు ఉండగా, ఆయా ఏరియాల్లో అత్యధికంగా ఓట్లు సాధించిన యూనియన్‌ను ప్రాతినిధ్య సంఘంగా గుర్తిస్తారు. పదకొండు ఏరియాల్లోనూ అత్యధికంగా ఓట్లు లభించిన యూని యన్‌ను గుర్తింపు సంఘంగా ప్రకటిస్తారు. సింగరేణిలో ఏడోసారి నిర్వహించిన ఎన్నికల్లో 11 ఏరియాల్లో 6 చోట్ల ఐఎన్‌టీయూసీ 5 చోట్ల గెలిచి ఏఐటీయూసీ ప్రాతినిధ్య సంఘాలుగా విజయం సాధించాయి. మొత్తంగా సింగరేణివ్యాప్తంగా అత్యధిక ఓట్లు సాధించి ఏఐటీయూసీ సంఘం గుర్తింపు సంఘంగా విజయ


సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో ఐఎన్‌టీయూసీ విజయంతో కార్మికుల సంబరాలు

కేతనం ఎగురవేసింది.

2017లో ఇలా: కేవలం రెండు డివిజన్లకే పరిమితమై ఏఐటీయూసీ ఈసారి ఐదు చోట్ల గెలవగా, ప్రాతినిధ్యం లేని ఐఎన్‌టీయూసీ ఆరుచోట్ల గెలవగా, 9 డివిజన్లలో ప్రాతినిధ్యమున్న టీబీజీకేఎస్ ఈసారి అడ్రస్ లేకుండా పోయింది.

ఆయా ఎన్నికల్లో గుర్తింపు ఇలా

1998	- ఏఐటీయూసీ
2001	- ఏఐటీయూసీ
2003	- ఐఎన్‌టీయూసీ
2007	- ఏఐటీయూసీ
2012	- టీబీజీకేఎస్
2017	- టీబీజీకేఎస్
2023	- ఏఐటీయూసీ

ఆయా ఏరియాల్లో ఇలా...

ఏరియా	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం	ప్రాతినిధ్యం	మెజారిటీ
రామగుండం-1	5,384	5,044	93.68	ఏఐటీయూసీ	417
రామగుండం- 2	3,556	3,369	94.74	ఏఐటీయూసీ	333
రామగుండం- 3	3,884	3,612	93.00	ఐఎన్‌టీయూసీ	104
భూపాలపల్లి	5,410	5,123	94.70	ఐఎన్‌టీయూసీ	826
బెల్లంపల్లి	996	959	96.29	ఏఐటీయూసీ	122
మందమర్రి	4,835	4,515	93.38	ఏఐటీయూసీ	469
శ్రీరాంపూర్	9,127	8,491	93.03	ఏఐటీయూసీ	2,166
కొత్తగూడెం	2,326	2,207	94.88	ఐఎన్‌టీయూసీ	233
ఇల్లందు	614	604	98.37	ఐఎన్‌టీయూసీ	46
మణుగూరు	2,450	2,378	97.06	ఐఎన్‌టీయూసీ	02
సీఓఆర్‌పీ	1,191	1,145	96.14	ఐఎన్‌టీయూసీ	324
మొత్తం	39,773	37,447	94.15		

అమెరికాలో రోడ్డు ప్రమాదం..
ఐదుగురు ఏపీ వాసుల దుర్మరణం

మృతులంతా ముమ్మిడివరం ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పినతండ్రి కుటుంబ సభ్యులు


అమెరికా టెక్సాస్‌లో రోడ్డు ప్రమాద దృశ్యం


అమలాపురం టౌన్: అమెరికాలోని టెక్సాస్‌లో జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన పొన్నాడ నాగేశ్వరరావు కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. ఇందులో మృతుడు నాగేశ్వరరావు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్‌కు స్వయానా పినతండ్రి. నాగేశ్వరరావు(65)తో పాటు ఆయన భార్య సీతామహాలక్ష్మి(60) కుమార్తె పోతాబత్తుల నవీన గంగ(38), ఆమె కుమారుడు కృతిక్(11), కుమార్తె నిషిధ(9) మృత్యువాత పడ్డారు. నాగేశ్వరరావు అల్లుడు పోతాబత్తుల లోకేశ్ తీవ్రంగా గాయపడి అక్కడే ఓ ఆస్పత్రిలో అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నారు. టెక్సాస్ జాతీయ రహదారిపై నాగేశ్వరరావు కుటుంబం కారులో వెళుతోంది. పక్కనే వస్తున్న ట్రక్కు, కారు బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ విషయాన్ని టెక్సాస్‌లోని ఓ న్యూస్ చానల్ ప్రకటించింది. ట్రక్కులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి కూడా మరణించినట్టు పేర్కొంది. అమలాపురంలో పొన్నాడ నాగేశ్వరరావు టింబర్ డిపో వ్యాపారిగా కోనసీమలో గత మూడున్నర దశాబ్దాలుగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. మూడో కుమార్తె నవీన గంగ కుటుంబం అమెరికాలో స్థిరపడింది. రెండు నెలల కిందట అమలాపురం వచ్చిన నవీన గంగ తిరిగి ఆ దేశానికి వెళుతూ తన తండ్రి నాగేశ్వరరావు, తల్లి సీతామహాలక్ష్మిని వెంట తీసుకుని వెళ్లింది. మంగళవారం సాయంత్రం ఓ పిక్నిక్ స్పాట్‌కు వెళ్లే సమయంలో వారిని మృత్యువు కబళించింది.

రాంగోపాల్ వర్మను చంపుతాం

తామంతా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అనుచరులమంటూ బెదిరింపు

బంజారాహిల్స్ (హైదరాబాద్): ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మను చంపుతామంటూ నినాదాలు చేయడమే కాకుండా ఆయన అంతు చూస్తామంటూ బెదిరిస్తూ కార్యాలయం ముందు దిష్టిబొమ్మ దగ్ధం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ రాంగోపాల్ వర్మ పీఏ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్ నం.71లోని రాంగోపాల్‌వర్మ కార్యాలయం వద్దకు ఈనెల 25న రాత్రి 12 నుంచి 15 మంది వరకు వచ్చి నినాదాలు చేస్తూ బెదిరింపులకు గురిచేస్తూ ఆర్జీవీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారని తెలిపారు. ఆ సమయంలో తమతో పాటు ఆర్జీవీ గన్‌మెన్, ఇతర సిబ్బంది అడ్డుకోవడానికి యత్నించగా తమపై దాడికి పాల్పడ్డారని పీఏ జిలాని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తామంతా ఏపీ మాజీ సీఎం చంద్రబాబు, నారా లోకేశ్, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అనుచరులమని చెప్పారన్నారు. వారి నుంచి ఆర్జీవీకి ప్రాణహాని ఉందని పేర్కొన్నారు.

నా తల నరికే వ్యాఖ్యలను బాబు, పవన్, లోకేశ్‌లు సమర్థిస్తున్నట్టే..



సాక్షి, అమరావతి: 'నా తల నరికితే రూ.కోటి ఇస్తానని అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షుడు కొలికపూడి శ్రీనివాసరావు చెప్పిన మాటలను 24 గంటలు గడిచినా చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణ్‌లు ఖండించలేదు. అంటే ఆయన మాటలను వారు సమర్థిస్తున్నట్టే భావించాలి' అని ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ పేర్కొన్నారు. టీవీ 5 చానల్లో ఓ డిబేట్‌లో కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యూహం సినిమా తీసిన రామ్‌గోపాల్ వర్మ తలనరికి తెస్తే రూ.కోటి ఇస్తానని ఆఫర్ ఇవ్వడం కలకలం సృష్టించింది. దీనిపై ఈ సినిమా నిర్మాత దాసరి కిరణ్‌కుమార్‌తో కలసి దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డికి బుధవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయం బయట మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. తనను చంపడానికి శ్రీనివాసరావు టీవీలో ప్రత్యక్ష ప్రసారం అవుతున్న డిబేట్‌లోనే ఓపెన్ ఆఫర్ ఇచ్చారన్నారు. ఆయన మాటలతో కిరాయి హంతకులు, ఇతరులు ఎవరైనా ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కొలికపూడి శ్రీనివాసరావుతో పాటు ఆ డిబేట్‌కు వ్యాఖ్యాత సాంబశివరావు, టీవీ 5 చానల్ యజమాని బీఆర్ నాయుడుపై డీజీపీకి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

గ్రూప్-2 పరీక్షలు మళ్లీ వాయిదా

మొదటి పేజీ తరువాయి

నిర్ణయమే కీలకమవుతుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సైతం బుధవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ గ్రూప్-2 పరీక్షలపై సమీక్షించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అంతలోనే టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం.

గతేడాది డిసెంబర్‌లో విడుదలైన నోటిఫికేషన్..

రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో 783 గ్రూప్-2 ఉద్యోగ ఖాళీలకు టీఎస్‌పీఎస్సీ గతేడాది డిసెంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించగా... రాష్ట్రవ్యాప్తంగా 5.5 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం టీఎస్‌పీఎస్సీ గ్రూప్-2 పరీక్షలను ఈ ఏడాది ఆగస్టు 29, 30 తేదీల్లో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. కానీ టీఎస్‌పీఎస్సీలో ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో పలు రకాల పరీక్షలు రద్దు కాగా, కొన్ని పరీక్షలు రీషెడ్యూల్ అయ్యాయి. ఆ తర్వాత గ్రూప్-2 పరీక్షలను నవంబర్ 2,3 తేదీల్లో నిర్వహించనున్నట్లు కమిషన్ ప్రకటించింది. పరీక్షల సన్నద్ధతకు సమయం కావాలంటూ అభ్యర్థులు ఆందోళన చేయడం, ఈలోగా ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో పరీక్షల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తుతాయని భావించిన కమిషన్ అధికారులు వచ్చే జనవరి 6, 7 తేదీలకు వాయిదా వేశారు. తాజాగా కమిషన్ చైర్మన్, సభ్యులు లేకపోవడంతో గ్రూప్-2 పరీక్షలు మరోమారు వాయిదా పడ్డాయి.

మళ్లీ మేడిగడ్డ, అన్నారం మునుగుతాయి

- సలహాదారుడు పెంటారెడ్డి హెచ్చరిక
- పంప్‌హౌజ్‌ల కంట్రోల్ యూనిట్‌ను ఎత్తైన ప్రాంతానికి తరలిస్తేనే నష్ట నివారణ
- నిర్మాణసమయంలో ఎత్తు తగ్గించడం వల్లనే పంప్‌హౌజ్‌లు మునిగాయని ఆరోపణ



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ, అన్నారం పంప్‌హౌజ్‌లు మళ్లీ నీటమునిగే ప్రమాదముందని రాష్ట్ర నీటిపారుదల శాఖ సలహాదారులు పెంటారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన జలసౌధలో మీడియాతో మాట్లాడారు. పంప్‌హౌజ్‌లకు సంబంధించిన కంట్రోల్ యూనిట్‌ను ఎత్తైన సురక్షిత ప్రాంతానికి తరలిస్తేనే మళ్లీ నష్టం జరగకుండా నివారించవచ్చని సూచించారు. మేడిగడ్డ పంప్‌హౌజ్‌ను 126 మీటర్ల ఎత్తులో కట్టడానికి తొలుత అనుమతిస్తే తర్వాత 120 మీటర్లకు తగ్గించి జెన్‌కో నుంచి డిజైన్లకు ఆమోదం తీసుకున్నారని ఆరోపించారు. అన్నారం పంప్‌హౌజ్‌ను తొలుత 131 మీటర్ల ఎత్తులో కట్టడానికి అనుమతిస్తే 125 మీటర్లకు తగ్గించారని తెలిపారు. ఎత్తును తగ్గించడంతోనే పంప్‌హౌజ్‌లు మునిగినట్టు ఆరోపించారు. 2022లో మునిగిన తరహాలోనే మళ్లీ ఈ రెండు పంప్ హౌజ్‌లు మునుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. బ్యారేజీల గరిష్ఠ నిల్వ మట్టం(ఎఫ్ఆర్ఎల్) కంటే ఎక్కువ ఎత్తులో పంప్‌హౌజ్‌లను కట్టాల్సి ఉండగా, తక్కువ ఎత్తులో నిర్మించడంతోనే సమస్యలొచ్చాయన్నారు.

నాటి మంత్రి ఒత్తిడితో భూగర్భంలో నిర్మించారు

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కూడా పంప్‌హౌజ్‌లను భూఉపరితలంలో నిర్మించాలని సిఫారసు చేస్తే, నాటి మంత్రి ఒత్తిడితో భూగర్భంలో నిర్మించారని ఆరోపించారు. మోటార్లు ఎఫ్ఆర్ఎల్‌కి తక్కువ ఎత్తులో పెట్టినా పెద్దగా నష్టం ఉండదని, కంట్రోల్ ప్యానెళ్లు, స్టార్టర్లు మాత్రం ఎత్తులో ఉండాల్సిందేనన్నారు. పటేల్ కంపెనీ తీరుతోనే కల్వకుర్తి లిఫ్టులోని పంప్‌హౌజ్ నీటమునిగి భారీ నష్టం జరిగిందని ఆరోపించారు.

రాష్ట్రస్థాయి ఆర్చరీలో బంగారు పతకం



మహబూబ్‌నగర్ క్రీడలు: గచ్చిబౌలీ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అండర్-17 ఆర్చరీ పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన ఎ.యశ్వంత్ యాదవ్ ప్రతిభ చాటాడు. ఈ పోటీల్లో బంగారు పతకం సాధించి వచ్చేనెల 10 నుంచి 12 వరకు చత్తీస్‌ఘఢ్‌లో జాతీయస్థాయి పోటీలకు ఎంపిక య్యాడు. బుధవారం ఆయనను స్థానిక మెయిన్ స్టేడియంలో జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అభినందించారు. జాతీయస్థాయిలో పతకం సాధించి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్చరీ సంఘం ప్రధాన కార్యదర్శి రాంచందర్, కోచ్ జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మిమిక్రీ పోటీల్లో జిల్లా వాసికి ప్రథమ బహుమతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రముఖ మిమిక్రీ కళాకారుడు నేరెళ్ల వేణుమాధవ్ జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్‌లో బుధవారం రాష్ట్రస్థాయి మిమిక్రీ పోటీలను మిమిక్రీ ఆర్టిస్టు వెల్ఫేర్ అసోసియేషన్, త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో వివిధ ప్రాంతాల నుంచి 100 మందికి పైగా మిమిక్రీ కళాకారులు పోటీల్లో పాల్గొనగా.. జిల్లాకు చెందిన మిమిక్రీ కళాకారుడు హరిప్రసాద్‌కు రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి లభించింది. దీంతో ఆయనకు రూ.10 వేల నగదు, ప్రశంసా పత్రం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి, సంఘం అధ్యక్షుడు చంద్రముఖి చంద్రశేఖర్, శ్రీనాథ్, వెంకటరమణ, రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.



అంగరంగ వైభవంగా రథోత్సవం


ఆంజనేయస్వామి రథోత్సవానికి హాజరైన భక్తులు


గజవాహనంపై ఊరేగుతున్న అంజన్న

- మార్మోగిన అంజన్న నామస్మరణ
- భక్తులతో కిక్కిరిసిన చిన్నరాజమూర్ జాతర మైదానం

దేవరకద్ర: చిన్నరాజమూర్ జాతర మైదానం అంజన్న నామస్మరణతో మార్మోగింది భక్తులు భక్తిపారవశ్యంలో మునిగితేలుతుండగా ఆంజనేయస్వామి రథోత్సవం బుధవారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి ఘట్టమైన గజవాహన సేవ అర్ధరాత్రి దాటిన తరువాత ఘనంగా నిర్వహించారు. దేవాలయం నుంచి స్వామివారి ఉత్సవమూర్తిని గజవాహనంపై తీసుకుని ఊరేగింపు చేపట్టారు. దాదాపు గంటపాటు గజవాహన సేవ కొనసాగింది. అనంతరం పూలు విద్యుదీపాలతో అలంకరించిన రథంపై శాస్త్రోక్తంగా స్వామిని ప్రతిష్ఠించారు. భక్తులు జేజేలు పలుకుతూ స్వామివారి రథాన్ని జాతర మైదానంలోకి తీసుకెళ్లారు. రథోత్సవం సందర్భంగా మిరుమిట్లు గొలిపేలా బాణాసంచా కాల్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు కన్నులపండువగా రథోత్సవాన్ని తిలకించారు.

ఘనంగా శ్రీచక్ర స్నానం...

ఉత్సవాల్లో భాగంగా ఆంజనేయస్వామి పల్లకీసేవతో పాటు అపబృత శ్రీచక్ర స్నానం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భజనలు చేశారు.

బారులు తీరిన భక్తులు...

స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. వేలాదిగా తరలివచ్చి స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. జాతర ఉత్సవాల్లో వెలిసిన మిఠాయి దుకాణాల వ్యాపారాలు జోరుగా సాగాయి. గాజుల దుకాణాలు, బొమ్మల దుకాణాలు కిక్కిరిసిపోయాయి.

మిరుమిట్లు గొలిపే.. పాలఉట్లు



పడమటి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం పాలఉట్ల కార్యక్రమం మిరుమిట్లు గొలిపాయి. భక్తుల కోలాటం, అడుగుల భజనల మధ్య మక్తల్ పట్టణంలో పల్లకీని ఊరేగింపుగా తీసుకెళ్లారు. స్వామివారి పాలఉట్లు కొట్టే కార్యక్రమానికి యువకులు పోటీపడ్డారు. దాదాపు గంటపాటు ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. మక్తల్‌కు చెందిన కొంత మంది యువకుల సాయంతో ఓ యువకుడు పైకెక్కి ఉట్టిని కొట్టాడు. ఈ సందర్భంగా ఆ యువకుడిని పలువురు అభినందించారు. కార్యక్రమానికి భక్తులు చుట్ట పక్కల గ్రామాలతో, పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో హాజరయ్యారు. మక్తల్ సీఐ రాంలాల్, మక్తల్ ఎస్ఐ పర్వతాలు ట్రాఫిక్‌ను సరిచేశారు. - మక్తల్

విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: వారాంతపు పరీక్షలు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పరీక్షించాలని డీఈఓ రవీందర్ ఉపాధ్యాయులు, అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఆర్వీఎం సమావేశ మందిరంలో పలు సబ్జెక్టు ఫోరాలు, కేజీబీవీల ఎస్ఓలతో డీఈఓ బుధవారం సమావేశం నిర్వహించారు. తరగతుల బోధనలో ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు. కేజీబీవీల ఉపాధ్యాయులు ఎస్సెస్సీ విద్యార్థుల ఫలితాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ శ్రీనివాస్, సీఎంఓ బాలు యాదవ్, ఎంఈఓలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

రామలింగేశ్వరాలయంలో ఆరుద్రోత్సవం



అడ్డాకుల: మండలంలోని కందూరు సమీపంలో స్వయంభూగా వెలిసిన రామలింగేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం ఆరుద్రోత్సవం(శివ ముక్కోటి) పూజలను నిర్వహించారు. అర్చకులు మణికంఠ శివాచార్య, శివశర్మలు ప్రధాన ఆలయంలోని శివలింగానికి విశేషాలంకరణ, ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. భక్తులు శివలింగాన్ని దర్శించుకుని, గౌరమ్మ ఆలయంలో పూజలు చేపట్టారు.

రంజీట్రోఫీ జట్టులో స్టాండ్‌బైగా గణేష్


జి.గణేష్


అరుణ్‌కుమార్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రానికి చెందిన యువ క్రికెట్ క్రీడాకారుడు జి.గణేష్‌కు హైదరాబాద్ రంజీట్రోఫీ జట్టు స్టాండ్‌బైలో స్థానం దక్కింది. 2015 క్రికెట్ కెరీర్ ప్రారంభించిన గణేష్ అనతికాలంలోనే జిల్లా జట్టులో ప్రధాన ఆటగాడిగా ఎదిగాడు. డాషింగ్ బ్యాట్స్‌మన్‌గా హెచ్‌సీఏ త్రీడేస్, టూడేస్ లీగ్‌ల్లో కంబైన్డ్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చాటాడు. ఇటీవల జింఖానా మైదానంలో జరిగిన సీనియర్ జోనల్ క్రికెట్ టోర్నీలో కంబైన్డ్ జట్టు తరఫున రెండు మ్యాచ్‌ల్లో కలిపి 350 పరుగులు చేశాడు. తొలి మ్యాచ్‌లో సెక్రటరీ లెవన్ జట్టు మొదటి ఇన్నింగ్‌లో 137, రెండో ఇన్నింగ్స్‌లో 73, రెండో మ్యాచ్‌లో సికింద్రబాద్ లెవన్ జట్టుపై మొదటి ఇన్నింగ్స్‌లో 49, రెండో ఇన్నింగ్‌లో 91 పరుగులు చేశాడు. అదే విధంగా గణేష్ ఇప్పటి వరకు 20కిపైగా త్రీడేస్ మ్యాచ్‌లు, 10 టూడేస్ మ్యాచ్‌లు ఆడాడు. టూడేస్ మ్యాచుల్లో 1,036 పరుగు చేయగా 2019-20 సీజన్‌లో రెండు ట్రిపుల్ సెంచరీలు (318 నాటౌట్, 329 పరుగు) చేశాడు.

సీకే నాయుడు ట్రోఫీ స్టాండ్‌బైలో అరుణకుమార్

గద్వాలకు చెందిన టి.అరుణ్‌కుమార్ కోల్ సీకే నాయుడు ట్రోఫీ జట్టు స్టాండ్‌బైలో చోటు దక్కించుకున్నాడు. అరుణ్‌కుమార్ ఇప్పటివరకు ఏడు త్రీడేస్ మ్యాచుల్లో ఆడాడు. గత ఏడాది, ఈ సీజన్ 55 వికెట్లు తీశాడు. 40కి పైగా టూడేస్ మ్యాచుల్లో ఆడి 100కు పైగా వికెట్లు తీశాడు. స్టాండ్‌బైలుగా ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపిక కావడంపై మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, వెంకటరామారావు, క్రిష్ణమూర్తి, కోచ్‌లు అబ్దుల్లా, గోపాలకృష్ణ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

అథ్లెటిక్స్ పురుషుల జట్టు పయనం


జట్టు సభ్యులతో పీడీ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు పాలమూరు యూనివర్సిటీ అథ్లెటిక్స్ పురుషుల జట్టు చైన్నై నగరానికి బుధవారం బయలుదేరింది. జట్టు సభ్యులకు వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ ట్రాక్‌సూట్‌లు అందజేశారు. పోటీలు టీఎస్‌పీఈఎస్ చెన్నైలో జరగనున్నాయి. కార్యక్రమంలో రిజిస్ట్రార్ గిరిజ, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, పీడీ శ్రీనివాసులు, కోచ్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా ఉల్లి ధర



దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో ఉల్లి ధరలు నిలకడగా ఉన్నాయి. బుధవారం మార్కెట్‌కు సెలవు కారణంగా పలువురు రైతులు ఉల్లిని అమ్మకానికి తెచ్చారు. వ్యాపారులు ధరలు నిర్ణయించి కొనుగోలు చేశారు. గత వారం పలికిన ధరలే ఈవారం వచ్చాయి. క్వింటాల్ ఉల్లి ధర గరిష్ఠంగా రూ. 2,500 కనిష్ఠంగా రూ.1,800 వరకు కొనుగోలు చేశారు. తూకాల అనంతరం 45 కేజీల ఉల్లి బస్తా గరిష్ఠంగా రూ.1,250, తక్కువగా రూ.900 వరకు విక్రయించారు. మార్కెట్‌లో జోరుగా లావాదేవీలు సాగాయి.